కథ

# ఫార్మాలిటీస్

బులుసు రాధాకృష్ణమూర్తి

**"సార్! మీరు అర్జంటుగా వర్కు చెయ్యమంటే, ఎక్స్‌ట్రా లేబరునిపెట్టి, రాత్రికి రాత్రి మరీ పని చేయించేను, మీ మాట మీద గౌరవం కొద్దీ. పనిచేయించి ఆరు నెలలయింది. కానీ ఇప్పటికీ మీ ఆఫీసునుండి ఎస్టిమేటు ఎస్.ఇ.గారి ఆఫీసుకి పోలేదు. వేలకి వేలు డబ్బు వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టేను. వడ్డీ రోజు రోజుకీ పెరిగిపోతోంది" కొంచెం కోపంగానే అడిగేడు రాకేష్.**

"భలేవాడివయ్యా! పనులు ఎలా చేయించుకోవాలో నీకు తెలియదనుకుంటాను. ఇంకా నీకు అలవాటు కాలేదు కదా! అనుభవం లేని వాడివి ఈ ఫీల్డుకి ఎందుకు వచ్చేవు? ఆరోజు నువ్వు ఏదో ఒక కాంట్రాక్టు ఇప్పించమని బ్రతిమాలితే ఇచ్చేనుకాని, బోల్డుమంది కాంట్రాక్టర్లు కాంట్రాక్టులకోసం క్యూలో నుంచున్నారు తెలుసా? వెళ్ళి ఆ ఎ.ఇ.గారిని కలుసుకుని, దగ్గరుండి ఎస్టిమేటు వేయించుకో" అంటూ కాలింగ్‌బెల్ నొక్కేరు ఇ.ఇ.రామనాథం గారు.

'పనిచెయ్యమని అడిగింది నీవైతే, ఎ.ఇ.ని నేను బ్రతిమాలడమేమిటి? అవసరం అయిపోయేక ఇలాగే మాట్లాడతారన్నమాట' మనసులో అనుకున్నాడు రాకేష్.

రాకేష్ సివిల్ ఇంజనీరింగులో డిగ్రీ తీసుకున్నాడు. ఇంజనీరింగు చదువుతున్నప్పుడు, తనొక పెద్ద ఇంజనీరునవుతానని ఎన్నో కలలు కన్నాడు. కానీ ఎన్నో ఇంజనీరింగు కాలేజీలు పుట్టగొడుగుల్లా రావడంతో వేలాదిమంది ఇంజనీర్లు రోడ్డున పడ్డారు. అందరు నిరుద్యోగుల్లాగే రాకేష్ ఎన్నో ఉద్యోగాలకప్లయి చేసేడు. ఎన్నో ఇంటర్వ్యూలకెళ్ళేడు. ఫలితం శూన్యం. రాకేష్ కన్నకలలు రోజురోజుకీ కరిగిపోసాగేయి.

ఆఖరికి ధైర్యం చేసి, ఒక స్నేహితుని ప్రోద్బలంతో కాంట్రాక్టులు చేయడానికి నిశ్చయించుకున్నాడు. రోడ్లు, భవనాలు శాఖలో వాళ్ళనీ వీళ్ళనీ ఆశ్రయించి, చిన్న చిన్న కాంట్రాక్టులు సంపాదించి పనులు ప్రారంభించేడు. అప్పుడు కానీ తెలిసిరాలేదు, కాంట్రాక్టు పనుల్లో ఎంత అవినీతి పేరుకుపోయిందో. ఇలాంటి అనుభవాలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. సరే ఏం చేస్తాం ఓర్పు వహించాలి డబ్బులు చేతిలో పడేవరకు. నెమ్మదిగా ఎ.ఇ.గారి సీటు దగ్గరికి వెళ్ళేడు. "సార్! ఏమైనా తయారయిందా?" అడిగేడు రాకేష్.

"లేదయ్యా! ఈమధ్య బిజీగా వున్నాను మిగిలిన వర్క్సతో" తనవైపు చూడకుండానే సమాధానమిచ్చేడు ఎ.ఇ.రవి.

"అదికాదండీ! నేను వర్క్ చేసి ఆరు నెలలయింది. ఇప్పటివరకు కనీసం ఎస్టిమేటు కూడా తయారవకపోతే.." కొంచెం కోపం ప్రదర్శిస్తూ అడిగేడు రాకేష్.

"అదేదో నా తప్పయినట్లు మాట్లాడతారేమిటి? నేనేమైనా వర్క్ చెయ్యమన్నానా?" విసుక్కున్నాడు ఎ.ఇ.

"మీరు చెయ్యమంటే ఒకటి, మీ ఇ.ఇ.గారు చెయ్యమంటే ఒకటీనా?" అడిగేడు రాకేష్.

"కాదనుకోండి. కానీ మా ఫార్మాలిటీస్.." నసిగేడు రవి.

"అదా! ఓ ష్యూర్! మీ పర్సంటేజి చెప్పండి" ఇంకా నెమ్మదిగా అన్నాడు రాకేష్.

ఇవన్నీ ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు రాకేష్.

"టెన్" ఫైలు తిరగేస్తూ సమాధానమిచ్చాడు రవి.

"ఓ.కే.సార్!"

"ఈ మాట ముందే చెబితే మీ ఎస్టిమేటు ఎప్పుడో వెళ్ళేది" వెకిలి నవ్వు నవ్వేడు ఎ.ఇ.రవి.

రెండు రోజుల తరువాత తన ఎస్టిమేటు ఎస్.ఇ.గారి ఆఫీసుకి వెళ్ళిపోయిందని చెప్పేడు రవి. హమ్మయ్య! ఇప్పటికి తన ఫైలు కదిలింది. లంచం- ఫైలుకి రెక్కలిస్తాయన్న నగ్న సత్యం తనకివాళ అనుభవజ్ఞమైంది. కానీ, రాకేష్ సంతోషం ఎంతో కాలం నిలువలేదు. ఎస్.ఇ.గారి ఆఫీసుకి తన ఫైలు వెళ్ళి రెండు నెలలయినా, డ్రాఫ్ట్‌మెన్ టేబులుమీద ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అక్కడే పడుంది. అసలు పొజిషన్ ఏమిటో కనుక్కుందామని డ్రాఫ్ట్‌మెన్ నాగభూషణం సీటు దగ్గరకెళ్ళేడు.

"నేను కాంట్రాక్టరు రాకేష్‌నండి. నా ఎస్టిమేటు ఒకటి మీ దగ్గరకు ఇ.ఇ.గారి ఆఫీసు నుండి వచ్చిందండి. దాని పొజిషన్ ఏమిటో కొంచెం చెబుతారా?" సవినయంగా అర్థించేడు రాకేష్.

"నేనిప్పుడు బిజీగా వున్నానండి. రేపు మా సి.ఇ.గారు వస్తున్నారు. రెండు రోజుల తరువాత కనబడండి" తీరుబాటుగా సమాధానమిచ్చేడు నాగభూషణం.

సరే రెండు రోజులు కాదు, నాలుగు రోజుల తరువాత మళ్ళీ వెళ్ళేడు రాకేష్.

"మీ ఎస్టిమేటు చూసేనండి. అన్నీ తప్పులు. షెడ్యూలు రేట్ల కన్నా చాలా ఎక్కువ వేసేరండి. అంచేత దాన్ని ఇ.ఇ.గారికి మళ్ళీ రిటర్ను చేస్తున్నాము" వికృతంగా నవ్వుతూ చెప్పేడు నాగభూషణం.

"సార్! ఇప్పటికి ఎనిమిది నెలలయింది, వర్క్ చేసి. ఆ ఎ.ఇ.గారిని పిలిచి కరెక్టు చేయించండి సార్! మళ్ళీ త్రిప్పి పంపితే ఏనాటికి మళ్ళీ మీకొస్తుందో?" చికాకుగా అడిగేడు రాకేష్.

"అలా ఇష్టమొచ్చినట్లు మేము కరెక్టు చెయ్యకూడదు. మాకూ కొన్ని రూల్సు వుంటాయి. మీకింకా క్రొత్త అనుకుంటా!" ముసిముసి నవ్వులు నవ్వుతూ చెప్పేడు నాగభూషణం.

"వుంటాయ్ సార్! కాని, రాత్రికి రాత్రే పని చేయించుకున్నప్పుడు ఈ రూల్సు సంగతి గుర్తుకురాదు. సరే, అవన్నీ ఎందుకుకాని, మీ పర్సంటేజి చెప్పండి ఎస్టిమేటు శాంక్షను చెయ్యడానికి!" అడిగేడు అప్పటికే విసుగెత్తిపోయిన రాకేష్.

అలా దారికి రా అనుకున్నాడు నాగభూషణం.

'ఇలా దగ్గరగా రా' అన్నట్లు సంజ్ఞ చేసేడు రాకేష్‌కి. రాకేష్ దగ్గరగా వంగేడు.

"అయిదు నాకు, టెన్ అయ్యగారికి" నెమ్మదిగా గొణిగేడు నాగభూషణం.

"ఓకే సర్! కాని కొంచెం తొందరగా చేసి పెట్టండి" అభ్యర్థించేడు రాకేష్.

మొత్తానికి అన్నమాట ప్రకారం రాకేష్ ఎస్టిమేటు శాంక్షను అయింది.

ఇక తదుపరి కార్యక్రమం బిల్లు వేయించుకోవడం. తను చేసిన వర్క్‌ని సూపర్‌వైజు చేసిన ఎ.ఇ.గారి దగ్గరకెళ్ళి-

"సార్! నా ఎస్టిమేటు శాంక్షను అయింది కదా! బిల్లు వేస్తే.." నసిగేడు రాకేష్. తను బిజీగా వున్నానని, ఇంటికొచ్చి కలవమనీ చెప్పేడు ఎ.ఇ. అర్థమయిపోయింది రాకేష్‌కి.

సరే. ఏం చేస్తాడు. మర్నాడుదయమే ఎ.ఇ. రాజుని ఇంటి దగ్గర దర్శనం చేసుకున్నాడు రాకేష్.

"ఆ! రావయ్యా రాకేష్! నా ఫార్మాలిటీస్ నీకు తెలుసోలేదోనని ఇంటికి రమ్మన్నానంతే. ఆఫీసులో బాగుండదు కదా" నవ్వేడు రాజు. 'వెధవ నవ్వు!

వీడి మొహానికి నవ్వొకటి. చెయ్యి చాపి మొస్తైత్తే వెధవలందరికీ ఇదో అలవాటు. ఒక్కొక్కడు ఒక్కొక్క విధంగా నవ్వుతాడు. ఆ నవ్వును బట్టి, వాడడిగే లంచం రేంజి చెప్పెయ్యొచ్చు' అనుకున్నాడు రాకేష్.

''సరే! చెప్పండి సార్!'' నుంచునే అడిగేడు రాకేష్.

''అరే! అలా నిలబడిపోతావేమిటి? రా! కూర్చో!'' సవినయంగా ఆహ్వానించేడు రాజు.

''ఫరవాలేదు. చెప్పండి సార్'' అన్నాడు రాకేష్.

''అరే కూర్చోవయ్యా బాబూ! మనిద్దరి రిలేషన్ ఈనాటితో తీరిపోయేది కాదు కదా! నువ్వు పనులు చేస్తూండాలి, నేను బిల్లులు వేస్తూండాలి. అంచేత ముందే, మనం ఒక అగ్రిమెంటుకి వచ్చేస్తే...సుజాతా! రెండు కాఫీలు పట్రా..'' మధ్యలో భార్యామణికి ఆర్డరిచ్చేడు. ఇదంతా అతగాడికి అలవాటే.

''వద్దు సార్! ఇప్పుడే త్రాగి వస్తున్నా'' చెప్పేడు రాకేష్.

''దానిదేముంది..కాఫీయే కదా! ఎన్నిసార్లు త్రాగినా ఫరవాలేదు'' సుజాత తెచ్చిన కాఫీ సిప్ చేస్తూ ''ఆ చెప్పు నీ ప్రపోజల్!'' మళ్ళీ నవ్వేడు రాజు. అదే. ఆ నవ్వే రాకేష్‌కి బి.పి.ని పెంచుతుంది.

''మీ ఇష్టం సార్! నేనేం చెబుతాను. నేను మీలాగే ఇంజనీరింగు చదువుకుని పొట్టపోసుకోవడానికి వచ్చినవాడినే. అంతేకాని లక్షలు సంపాదిద్దామన్న దురాశ ఏమీ లేదు. మీరు అర్థం చేసుకోవాలి'' చెప్పేడు రాకేష్, తోటి ఇంజనీరుని ఏకవచనంతో సంభోదిస్తున్న రాజు సంస్కారాన్ని మనసులో అసహ్యించుకుంటూ.

''నాకు మామూలుగా అందరూ ట్వంటీ ఇస్తున్నారు'' చెప్పేడు రాజు.

''ట్వంటీయా?''

షాక్ తిన్నాడు రాకేష్.

''అవునయ్యా! అలా కంగారు పడతావేమిటి? నువ్వు చేసిన వర్కు ఒరిజినల్ వాల్యూ అర్వై వేలు. కానీ ఎస్టిమేటు లక్షకి వెయ్యలేదూ?'' గదమాయించేడు రాజు.

''సరే సార్! ఆర్గ్యుమెంట్సు ఎందుకు? టెన్ తీసుకోండి. అంతకు మించి నేనివ్వలేను'' చెప్పేడు రాకేష్.

''బిల్లంటే ఏమిటయ్యా! ఏ వర్కుకైనా అది గుండెకాయలాంటిది'' నవ్వేడు రాజు. ఈ వెధవకి కవిత్వం కూడా వచ్చు! లోలోపల మండిపోతోంది రాకేష్‌కి.

''నేను టెన్‌కన్నా ఇచ్చుకోలేను సార్! ఆపైన మీ ఇష్టం'' కుర్చీలోంచి లేవబోయాడు రాకేష్.

ఇర్వై డిమాండ్ చేస్తే కనీసం పదైనా ఇస్తాడని అడిగేడు కాని, తనకి తెలీక కాదు. అయినా రాకేష్ పల్సు చూసి, క్రొత్తగా ఈ ఫీల్డులోకి వచ్చేడని, వచ్చినంతవరకు దండుకుందామన్న నీచబుద్ధి రాజుది.

''సరేలేవయ్యా! నువ్వెక్కడికి పోతావు. నేనెక్కడికి పోతాను. నువ్వు కూడా ఇంజనీరువే కదా! కాని,



నాకు అడ్వాన్సుగా ఇవ్వాలి తెలుసు కదా!'' మళ్ళీ అదే నవ్వు.

''తెలుసు సార్! అందుకే ముందుగా తెచ్చా! ఇదిగో సార్'' కవరందించేడు రాకేష్.

''వెరీగుడ్. నీ బిల్లు ఈ వేళే వేస్తాను. సాయంత్రం వచ్చి సంతకం పెట్టు. వెంటనే అకౌంట్స్ సెక్షనుకి పంపించేస్తాను.''

''థాంక్యూ'' అయిష్టంగానే చెప్పి శలవు తీసుకున్నాడు రాకేష్.

అన్నమాట ప్రకారం మర్నాడు బిల్లుని అకౌంట్స్ సెక్షన్‌కి పంపేడు.

రెండురోజులాగాక, అకౌంట్స్ సెక్షను ఆఫీసరుని కలిసేడు.

''సార్! నా బిల్లు మీ దగ్గరకొచ్చింది. మీరు పాస్ చేస్తే..'' నసిగేడు రాకేష్.

''ఓహో! మీరు క్రొత్తగా కాంట్రాక్టు చేస్తున్నారు కదూ! ఏమిటి ఇలా అడుగుతున్నారని ఆశ్చర్యమేసింది'' అదోలా నవ్వేడు అకౌంట్స్ ఆఫీసర్ ఆచారి. ఇక జరిగింది మామూలే. ఆచారికి అయిదు పర్సెంట్, క్యాష్ అకౌంటెంటుకి అయిదు పర్సెంట్. చివరికి చెక్కు ఇ.ఇ.గారి టేబులు మీదకెళ్ళింది. అంటేక్లయిమేక్సు. ఇ.ఇ.గారిని కలిసేడు.

''సార్! నా చెక్కు'' అడిగేడు రాకేష్.

''ఆ! రావయ్యా రాకేష్! కూర్చో! మొత్తానికి అన్నీ నేర్చుకున్నావన్నమాట. ఇంక నీకు ఢోకా లేదు!'' నవ్వుతూ అన్నారు ఇ.ఇ.రామనాథంగారు.

ఇది తన మజిలీలలో చివరిది. ఇప్పటివరకు తను ఇచ్చిన పర్సెంటేజీలు నలభై అయిదు, తను చేసిన వర్కు విలువ లక్ష. తను పెట్టిన పెట్టుబడి నలభై వేలు. ఇప్పుడు ఇ.ఇ.గారడిగే పర్సెంటేజిని బట్టి తన లాభముంటుంది. కాలింగ్‌బెల్ నొక్కి కాఫీ ఆర్డరిచ్చేరు ఇ.ఇ. ''మా ఎ.ఇ. చెప్పలేదా?'' సందేహంగా అడిగేరు ఇ.ఇ.

''లేదు సార్'' ముచ్చెమటల్లు పడుతున్నాయి రాకేష్‌కి.

''నాది ఫిఫ్టీన్! తెచ్చేవా?'' ప్రశ్నార్థకంగా అడిగేడు రామనాథంగారు. ''సార్! మీకు ఫిఫ్టీన్ ఇస్తే చివరికి నాకు మిగిలేది బిగ్ జీరో! ఏదో కాంట్రాక్టులు చేసుకుని బ్రతకొచ్చు అనుకున్నాను కాని, ఇలా అడుగడుగునా జలగల్లా నా రక్తం త్రాగుతారనుకోలేదు సార్!'' ఏడుపొచ్చినంత పనయింది రాకేష్‌కి. ''ఇదిగో సార్ మీ కవరు. నేను పెట్టుబడి పెట్టిన డబ్బొస్తే చాలు. థాంక్యూ సార్! మీకూ మీ కాంట్రాక్టులకీ ఓ దండం'' నిష్క్రమించేడు రాకేష్ అసహనంగా! *